# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణలాంటిదని ఉపరాష్ట్రపతి సీ.పీ.రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- దేశీయ నౌకా నిర్మాణం, నౌకా వాణిజ్య రంగాల పునరుజ్జీవనం కోసం 69,725 కోట్ల రూపాయల సమగ్ర ప్యాకేజ్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ న్యూయార్క్‌లో ఈరోజు ప్రపంచ దక్షిణాది దేశాల ప్రతినిధులతో సమావేశమయ్యారు.
- భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య కొద్ది సేపటి క్రితం ఆసియా కప్ టీ-20 క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది.

=======================

ఆంధ్రప్రదేశ్ దేశానికి అన్నపూర్ణలాంటిదిదని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు సాయంత్రం విజయవాడ ఉత్సవ్‌లో కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రజలందరికీ కనకదుర్గమ్మ వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ.. దసరా శుభాకాంక్షలు తెలిపారు.

(వాయిస్ 31 సెకన్లు)

విజయవాడ ఉత్సవ్ ముగించుకుని తిరుపతికి తిరుగు ప్రయాణమైన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఇతర ప్రజా ప్రతినిధులు వీడ్కోలు పలికారు.

=======================

దేశీయ నౌకా నిర్మాణం, నౌకా వాణిజ్య రంగాల పునరుజ్జీవనం కోసం నిర్దేశించిన 69 వేల 725 కోట్ల రూపాయల సమగ్ర ప్యాకేజ్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజ్ కింద మొత్తం 24 వేల 736 కోట్ల రూపాయల కార్పస్‌తో నౌకా

నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించే పథకం (ఎస్‌బీఎఫ్ఏఎస్) గడువును 2036 మార్చి 31 వరకు పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమయ్యింది. ఈ కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. బిహార్‌లో 2 వేల 192 కోట్ల రూపాయలతో భక్తియార్‌పుర్-రాజ్‌గిర్-తిలయ్యా రైల్వే డబ్లింగ్ పనులకు ఈ సమావేశంలో మంత్రివర్గ ఆమోదం లభించిందన్నారు. ఇక సాహెబ్‌గంజ్-అరెరాజ్-బెతియా మధ్య 3 వేల 822 కోట్ల రూపాయలతో 78.9 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అలాగే దేశవ్యాప్తంగా వైద్య విద్యా సీట్లను పెంచడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, దీంతో 2028-29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 5 వేల 023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

అలాగే రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పనితీరు ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

======================

ఛత్తీస్‌గఢ్ లో ఈరోజు 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ వద్ద లొంగిపోయిన మావోయిస్టులలో 50 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నారని.. వారిలో 30 మందిపై 64 లక్షల రూపాయల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడంతో పాటూ ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నాయని బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసేలా చేయటమే తమ ఉద్దేశ్యమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా అసంఘటిత రంగం బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం...

(వాయిస్ 90 సెకన్లు)

======================

అమెరికా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సెషన్ సందర్భంగా న్యూయార్క్‌లో ఈరోజు ప్రపంచ దక్షిణాది దేశాల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణాది దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇప్పటికే ఉన్న వేదికలను ఉపయోగించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. ఐక్య రాజ్య సమితిలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సందర్భంగా ఆయన పలు ప్రతిపాదనలు చేశారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

ఆసియా కప్ సూపర్ ఫోర్‌లో భాగంగా ఈరోజు భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ దుబాయ్ వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన బంగ్లాదేశ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 5 ఓవర్లు పూర్తయ్యేసరికి వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసింది.

=======================

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాబోయే రెండు రోజుల పాటూ ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

=======================